క్లుప్తంగా

పిట్టంబండ మేజరు అభివృద్ధి పనులకు శ్రీకారం



శావల్యాపురం: ఖరీఫ్‌కు సాగునీరు విడుదల చేస్తామని ప్రభుత్వం ప్రకటించటంతో పిట్టంబండ మేజరు కాల్వ పరిధిలో ఉన్న గ్రామాలు గుంటుపాలెం, వయ్యకల్లు, మతుకుమల్లి, చినకంచర్ల, పిట్టంబండ, ఏనుగుపాలెం, ముండ్రువారిపాలెం గ్రామాలకు చెందిన సాగునీటి కాల్వల్లో ఇరువైపుల పిచ్చిచెట్లు, ముళ్ళకంచెలు, పూడికతీత పనులు పొక్లయినర్ ద్వారా చేస్తున్నారు. మండలంలోని గుంటుపాలెం వాసీ ప్రముఖ డాక్టర్ అన్నవరపు వీరాంజనేయులు మాట్లాడుతూ రైతుల అభీష్టం మేరకు తనవంతు సహకారం అందిస్తున్నా అన్నారు. ఎన్నెస్పీ అధికారులు పనులను పర్యవేక్షణ చేస్తున్నారని మేజరు పరిధిలో 8 కిలోమీటర్ల వరకు పనులు జరుగుతున్నాయన్నారు. పిట్టంబండ మేజరు పరిధిలో సుమారు 6 వేల ఎకరాల సాగు భూమి ఉండగా చివరి భూముల వరకు సాగునీరు అందేలా రైతులు ఐక్యంగా అభివృద్ధి పనులకు సహకారం అందించుతున్నారని ఎన్నెస్పీ ఏఈ పోట్లూరి లక్ష్మీ నారాయణ తెలిపారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వినుకొండ టౌన్: ఐటీఐలో చేరేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వినుకొండ పట్టణ శివారులోని శ్రీ బాలాజీ ఐ.టి.ఐ కళాశాల ప్రిన్సిపల్ కర్రి వెంకట్ గురువారం తెలియచేశారు. 2024–25 విద్యా సంవత్సరానికిగాను దరఖాస్తులుల స్వీకరిస్తున్నామని, 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఎవరైనా ఆగస్టు 31న జరగబోయే 3వ విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఆగస్టు 26వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు తమ దరఖాస్తుతోపాటు 10వ తరగతి మార్క్ లిస్టు, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్పోర్ట్ సైజు ఫోటోలతో కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐటీఐ రెండు సంవత్సరాలు పూర్తి చేసిన వారికి ఇగ్నో ఓపెన్ యూనివర్సిటీ ద్వారా ఓపెన్ డిగ్రీ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఐటీఐ కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయన్నారు. ఇతర వివరములకు 9440542030, 8341821710, 7702892288, 8465819546, 9985307590 నెంబర్లను సంప్రదించాలన్నారు.

టెన్త్, ఇంటర్ కోర్సులపై ఉపాధ్యాయులకు అవగాహన



రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం రాష్ట్ర కో–ఆర్డినేటర్ ఎస్. అక్బర్ ఆలీ గురువారం సందర్శించారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వారు పదవతరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న వివిధ కోర్సులపై ఉపాధ్యాయులకు అవగాహన కలిగించారు. బడి మధ్యలో మానివేసిన విద్యార్థులు, పదవతరగతి తప్పిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా విద్యను కొనసాగించవచ్చు అన్నారు. ఓపెన్ స్కూల్‌లో పదవతరగతి ప్రవేశానికి 14 సంవత్సరాలు, ఇంటర్మీడియట్‌కు 15 సంవత్సరములు కనీస వయస్సుగా నిర్ణయించడం జరిగిందన్నారు. 2024–25 విద్యా సంవత్సరమునకు అడ్మిషన్లు ప్రారంభమయ్యానన్నారు. అర్హత ఉన్న వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వారి కరపత్రాలను, వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బీయం సుభానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన



వినుకొండ(నూజెండ్ల): మండలంలోని పిట్టంబండ, ఉమ్మడివరం గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో సాఫ్ట్ డయేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అజిత మాట్లాడుతూ సీజనల్ వ్యాధులకు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి ఒక్క విద్యార్థి వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలన్నారు. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కడుపు నొప్పి, జ్వరం, కడుపులో వికారంగా ఉంటే వెంటనే ఆశ కార్యకర్త, ఏఎన్ఎంను కలిసి టాబ్లెట్స్ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ ప్రభాకర్‌రావు, హెచ్ఎంవై. భాస్కరరావు, ఏఎన్ఎం నూర్జహాన్, హారతిబాయి, శ్రీలక్ష్మి, సీహెచ్‌వో ఎస్.పావని, ఉపాధ్యాయులు కె.విజయ, ఎం.దివ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రతి పంచాయతీ కేంద్రంలో గ్రామసభ

బొల్లాపల్లి: నేడు ప్రతి గ్రామపంచాయతీలో గ్రామసభలు జరుగుతాయని ఎంపీడీవో షేక్ గౌసియా బేగం గురువారం తెలిపారు. మండలంలోని 33 గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించాలని, గ్రామపంచాయతీ సర్పంచ్, కార్యదర్శి ఆ గ్రామసభల నిర్వహణలో పాల్గొంటారని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో పలు అంశాలపై గ్రామసభల్లో చర్చించనున్నట్లు తెలిపారు. 2024–25కు సంబంధించి నూతన పనులు గుర్తించాల్సి ఉంటుందన్నారు. వేతన కూలీలు, హక్కులు, అర్హతల గురించి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికై ఉపాధి హామీ పథకంలో పనులను గ్రామసభ దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండలస్థాయి అధికారులు ఆయా గ్రామసభలపై పర్యవేక్షకులుగా వ్యవహరిస్తారని, ప్రతి పంచాయతీ కేంద్రంలో ఉదయం 9 గంటలకు, కొన్ని పంచాయతీల్లో మధ్యాహ్నం 3 గంటలకు గ్రామసభలు ప్రారంభం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకంలోని కూలీలు, గ్రామస్తులు ఆయా గ్రామసభల్లో పాల్గొని ఏమైన సమస్యలను ఉంటే గ్రామసభ దృష్టికి తీసుకురావాలన్నారు.

నాదెండ్లలో హాజరుకానున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

నాదెండ్ల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను కొత్త పనులు నిర్వహించేందుకు శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు జరగనున్నాయి. మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో జరిగే గ్రామ సభకు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హాజరుకానున్నారు. ఈ సభలో నూతనంగా చేపట్టబోయే పనుల గురించి ఆమోదం కోసం గ్రామ సభలు జరగనున్నాయి. ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలకు సంబంధించి గోకులం షెడ్లు, హార్టీకల్చర్, ఇన్‌స్టిట్యూషన్, బండ్, ఎవెన్యూ ప్లాంటేషన్, హౌసింగ్ విభాగాలకు సంబంధించిన పనులు ఆమోదించనున్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

గ్రామసభలను విజయవంతం చేయండి

శావల్యాపురం: నేడు గ్రామాల్లో జరగనున్న ఉపాధి గ్రామసభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నేడు అన్నీ గ్రామ పంచాయతీలో నిర్వహించే ఉపాధి గ్రామసభల నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులతో అన్నీ శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు అన్నీ గ్రామ పంచాయతీల్లో అన్నీ శాఖల అధికారులు ప్రజాప్రతినిధుల సమక్షంలో గ్రామసభలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. గ్రామాల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో గ్రామసభలు నిర్వహించి గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాల్వలు, మినీ గోకుల షెడ్లు నిర్మాణాలు తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈసమావేశంలో ఈవోపీఆర్‌డి పి.సుగుణ, పశువైద్యాధికారి పాలపర్తి గణేష్ కుమార్, ఏపీవో కె.రామారావు పాల్గొన్నారు.

గణపవరం ఆర్చ్ నిర్మాణానికి శంకుస్థాపన

నాదెండ్ల: గణపవరం గ్రామ ముఖద్వారం (ఆర్చ్) నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శంకుస్థాపన చేశారు. దాతల సహకారంతో సుమారు రూ.13 లక్షల వ్యయంతో గణపవరం గ్రామం ప్రత్తిపాటి పుల్లారావు రహదారి పేరిట ముఖద్వారం నిర్మాణానికి పూజా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు తోట రాజారమేష్, మున్సిపల్ కౌన్సిలర్ గంగా శ్రీనివాసరావు, నాయకులు కెల్లంపల్లి అచ్చయ్య, గాలి బుచ్చయ్య, జంపని శ్రీనివాసరావు, కెల్లంపల్లి నరసింహారావు, జంపని సత్యనారాయణ, సలిశం శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ పెనుమల జాన్ బాబు, వలేటి నరసింహా రావు, దారా కొండయ్య, పెంట్యాల శేషయ్య, కాట్రు కృష్ణ జంపని వెంకటేశ్వరరావు, తూబాటి శేషు, మేస్త్రీ శ్రీనివాసరావు ఉన్నారు.

సాగునీరు అందించాలంటూ రైతుల వినతి

గణపవరం గ్రామంలో సీతారామ ఎత్తిపోతల పథకం కొంతకాలంగా మరమ్మతులకు గురైందని, దుండగులు రెండు ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి కాపర్‌వైరు, ఆయిల్ దొంగిలించారని, వీటి మరమ్మతులు నిర్వహించి సాగునీరు అందించాలని గ్రామానికి చెందిన పలువురు రైతులు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు దృష్టికి తీసుకొచ్చారు. త్వరలో మిరప నాట్లు, పొగాకు నాట్లు వేయనున్నందున కొద్దిరోజుల్లో మరమ్మతులు చేయించాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ రాష్ట్రవ్యాప్తంగా లిఫ్ట్ ఇరిగేషన్‌లు మరమ్మతులకు గురయ్యాయని, వీటిపై నివేదిక రూపొందించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి నిధుల మంజూరుకు కృషి చేస్తామన్నారు. సాగునీరందేలా అధికారులతో చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.



గణపవరంలో ముఖద్వారం (ఆర్చ్) నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

కల్యాణ మండప నిర్మాణానికి అనుమతి ఇప్పించండి

గంగా పార్వతీ సమేత సోమేశ్వరస్వామి దేవస్థానానికి సంబంధించిన కొంత భూమి బైపాస్ రోడ్డు నిర్మాణంలో సేకరించటంతో ప్రభుత్వం నుంచి రూ.4 కోట్లు నష్టపరిహారం అందిందని, ఆ నిధులతో గ్రామంలో కల్యాణ మండపం నిర్మించేందుకు అనుమతి ఇప్పించాలని ఆలయ ధర్మకర్త కెల్లంపల్లి వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే పుల్లారావును విన్నవించారు. గ్రామంలోని శివాలయం పక్కన ఉన్న చెరువును కొంతమేర పూడ్చి మండపం నిర్మించేందుకు దేవదాయ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడాలని కోరారు.

శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యం

ఎమ్మెల్యే చదలవాడను మర్యాదపూర్వకంగా కలిసిన డీఎస్పీ కె.నాగేశ్వరరావు

నరసరావుపేట: కూటమి ప్రభుత్వంలో శాంతిభద్రతలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. డివిజన్ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన కె.నాగేశ్వరరావు గురువారం ఎమ్మెల్యే చదలవాడను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను బహూకరించారు. ఎమ్మెల్యే ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. సమర్థులైన అధికారులు కీలక స్థానాల్లో నియమించడం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు మంచి సందేశం ఇస్తున్నారన్నారు. మరీ ముఖ్యంగా కొంతకాలంగా డివిజన్‌లో నెలకొన్న పరిస్థితులు, శాంతిభద్రతలు ఇతర అంశాలపై చర్చించారు. ప్రశాంత వాతావరణం కోసం పూర్తిస్థాయిలో డీఎస్పీకి సహకరిస్తామన్నారని ఎమ్మెల్యే డీఎస్పీకి హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యే చదలవాడ గృహంలో ఆయనను కలిసిన డీఎస్పీ నాగేశ్వరరావు

ఏవోగా శివలలిత



రొంపిచర్ల: మండల వ్యవసాయ అధికారిగా శివలలిత గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆమె నెల్లూరుజిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో టెక్నికల్ ఏవోగా పనిచేస్తూ సాధారణ బదీలలో భాగంగా రొంపిచర్ల వ్యవసాయ అధికారిగా వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ వ్యవసాయ అధికారిగా పనిచేసిన విజయభాస్కర్ నెల్లూరు డీఏవో ఆఫీస్‌లో టెక్నికల్ ఏవోగా బదిలీ అయ్యి వెళ్లటంతో ఈ నియామకం అవసరమైంది. ఈ సందర్భంగా మండలంలోని పలువురు వీపీఏలు, కార్యాలయ సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని రైతులందరూ తాము సాగు చేస్తున్న పంటలను ఈ–క్రాఫ్ చేయించుకోవాలన్నారు. ఈ–క్రాఫ్ నమోదు వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులకు మేలు జరుగుతుందన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

పెదకూరపాడు: పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా సంగం డెయిరీ పని చేస్తుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులో 200 మంది పాడి రైతులకు రూ.6,04,000లు బోనస్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు డెయిరీ పాలకవర్గ సభ్యుడు వలివేటి ధర్మరావు అధ్యక్షత వహించారు. పశు గ్రాసం కోసం రూ.12వేల నగదు, ఇన్సూరెన్సు, గడ్డి విత్తనాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గుడిపూడి రాజు, టీడీపీ మండలాధ్యక్షుడు ఆర్తిమళ్ల రమేష్, డెయిరీ అధ్యక్షుడు గుండప నేని బాష, వైఎస్ ఎంపీపీ షేక్ బాష, మాజీ ఎంపీపీ గల్లా బాబురావు, మహిళ నాయకురాలు షేక్ ముంతాజ్ ఉన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

రొంపిచర్ల: పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని కొల్‌కత్తాలో ట్రైనీ లేడీ డాక్టర్ పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం స్థానిక చెరువు కట్ట సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ ఏరియా కార్యదర్శి చక్రవరం సత్యనారాయణ రాజు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో కొల్‌కత్తాలో గల ఆర్ జి కర్ వైద్య కళాశాలలో విధులలో ఉన్న ట్రైనీ లేడీ డాక్టర్ మౌమితను లైంగికంగా వేధించి అత్యాచారం చేసి హత్య చేయడం దారుణమన్నారు. ఈ సంఘటనకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇందుకు వైద్య కళాశాల ప్రిన్సిపాల్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పూర్తి బాధ్యత వహించాలన్నారు. దేశంలో, రాష్ట్రాలలో మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు. నిందితులకు శిక్షపడేంత వరకు ఉద్యమిస్తామన్నారు. అనంతరం ట్రైనీ లేడీ డాక్టర్ పై హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, పని ప్రదేశాలలో స్త్రీలకు రక్షణ కల్పించాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో భగత్ సింగ్ భవన్ నిర్వహణ కమిటీ సభ్యులు ఎస్.శేషంరాజు, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు, సీపీఐ మండల కార్యదర్శి రొద్దా అంజిరెడ్డి, మండల నాయకులు మోహనరావు, ముప్పూరి మధుసూదనరావు, ఆర్ఎంపీ డాక్టర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



నరసరావుపేట పార్టీ కార్యాలయంలో కేకు కట్ చేస్తున్న నాయకులు



చిలకలూరిపేట వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహిస్తున్న చిరంజీవి అభిమానులు

నరసరావుపేట: పద్మ విభూషణ్ డాక్టర్ మెగాస్టార్ చిరంజీవి 69వ జన్మదిన వేడుకలు స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి చిరంజీవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజారాజ్యం పార్టీ స్థాపించి ఎంతోమంది నాయకులుగా ఎదిగేందుకు ముఖ్య కారకులయ్యారని, సేవారంగంలో ముందుండి ఎన్నో కార్యక్రమాలు చేశారని అన్నారు. పట్టణ అధ్యక్షులు జీవీ ప్రసాద్, రొంపిచర్ల మండల అధ్యక్షులు అచ్చుల సాంబశివరావు, పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి అద్రూఫ్, బాషా, నాగుల్ మీరా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: ప్రముఖ సినీహీరో చిరంజీవి జన్మదిన వేడుకలు ఆయన అభిమాన సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. టౌన్‌వైడ్ చిరంజీవి ఫాన్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బేరింగ్ మౌలాలి, మాజీ ఉపాధ్యక్షుడు మైలా గణేష్ తదితరుల ఆధ్వర్యంలో పట్టణంలోని బాపూజీ వృద్ధాశ్రమంలో జన్మదిన కేక్ చేసి వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఉయ్యూరు నరసింహరావు, మైలా రాజేష్, పుల్లంశెట్టి చంద్రమౌళి పాల్గొన్నారు.

కాపునాడు సేవా సమితి ఆధ్వర్యంలో...

ఏపీ కాపునాడు సేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని కాపుభవన్‌లో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి అభిమానులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమాన సంఘం మాజీ అధ్యక్షుడు షేక్ అల్లీమియా, కాపు సేవా సమితి సభ్యులు గోవిందు శంకర్ శ్రీనివాస్, తోట లక్ష్మీనారాయణ, చౌడవరపు రామారావు, తోట శ్రీనివాసరావు, అచ్చుకోల మురళి పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

పరిశుభ్రమైన ఆహార పదార్థాలు వడ్డించాలి

నకరికల్లు: ఆశ్రమంలో అన్నదానం చేయదలచిన వారు అక్కడే తయారుచేసిన పరిశుభ్రమైన పదార్థాలనే వడ్డించాలని జిల్లా ప్రొహిబిషన్ అధికారి బి.సత్యనారాయణ సూచించారు. మండలంలోని కొండమోడు వీరమ్మ కాలనీలోని దీనమ్మ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చిల్డ్రన్స్ హోంను గురువారం సందర్శించారు. చిల్డ్రన్స్ హోంలో కల్పిస్తున్న సదుపాయాలు పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్డ్రన్స్ హోంకు ప్రభుత్వం ద్వారా 2018లో లైసెన్స్ మంజూరు చేసిందని, గడువు ముగియడంతో లైసెన్స్ పునరుద్ధరణకు మరోసారి పరిశీలించినట్లు తెలిపారు. శుభకార్యాలకు, ఫంక్షన్‌కు అన్నదానం చేయదలచిన వారు బయట వండిన ఆహారం తీసుకురావద్దన్నారు. అనకాపల్లిలో జరిగిన ఘటన నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి డి.శౌరిరాజు, డీఓఐసీ కృష్ణారెడ్డి, పీఓఎస్ఐసీ ప్రశాంత్‌కుమార్, అసిస్టెంట్ సీడీపీఓ సంతోష కుమారి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ, ఆశ్రమ నిర్వాహకులు గరికపాటి శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చామా.. వెళ్లామా..!

- మొక్కుబడిగా మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం
- సమస్యల ప్రస్తావన లేకుండానే ముగింపు

ముప్పాళ్ళ: మూడు నెలలకొకమారు జరిగే మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మొక్కుబడిగానే ముగిసింది. ఎంపీపీ మారూరి పద్మ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధికారులు వారి శాఖల ద్వారా అందించే పథకాలు గురించే వివరిస్తూ సమావేశాన్ని కొనసాగించారు. గౌరవ సభ్యులు సమావేశ మందిరానికి రాగానే వారితో సంతకాలు చేయించుకోవడం తప్ప గ్రామాల్లో సమస్యల ప్రస్తావన గురించి చర్చించిన దాఖలాలు లేవు. మొత్తం 14 గ్రామ పంచాయతీలకు గాను 7 గ్రామాల సర్పంచ్‌లు మాత్రమే హాజరయ్యారు. 12 మంది ఎంపీటీసీలకు గాను ఏడుగురు హాజరయ్యారు. తహసీల్దార్ ఎం.భవానిశంకర్ వచ్చే నెలలో నిర్వహించే రెవెన్యూ గ్రామ సభల గురించి వివరించారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎం.భవానిశంకర్

గ్రామాల్లో నూరు శాతం ఇంటి పన్ను బకాయిలు వసూలు చేయాలని ఈఓపీఆర్డీ రూపవతి చెప్పారు. బొల్లవరం–రుద్రవరం గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎంపీటీసీ సభ్యుడు కళ్లం వీరభాస్కరరెడ్డి అధికారులను కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ శిరిగిరి చంద్రకళ, ఎంపీడీఓ పి.పుట్టారెడ్డి, వైస్ ఎంపీపీ చిరుగూరి రాయన్న, కో–ఆప్షన్ సభ్యుడు అజ్గర్‌ఆలీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ విధానంతో బహుళ ప్రయోజనాలు

నకరికల్లు: డ్రమ్ సీడర్ విధానంలో వరి సాగు చేయడం వల్ల బహుళ ప్రయోజనాలు కలుగుతాయని సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. రూపెనగుంట్ల గ్రామంలో మేదరమెట్ల బ్రహ్మయ్య అనే రైతు 3.5 ఎకరాల్లో కేఎన్ఎం 1,638 వరిరకాన్ని డ్రమ్ సీడర్ పద్ధతిలో సాగుచేస్తుండగా గురువారం పరిశీలించారు.

ఈ సందర్భంగా రైతుతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రమ్ సీడర్ విధానంలో 12 నుంచి 14 కేజీల విత్తనాలు మాత్రమే ఎకరాకు సరిపోతాయని తెలిపారు. పొలంలో మొక్క సాంద్రత అధికంగా వస్తుందన్నారు. సాధారణ విధానం కన్నా వారం ముందుగానే పంట కోతకు వస్తుందన్నారు. దిగుబడి కూడా 4 నుంచి 5 బస్తాలు అధికంగా ఉంటుందని వివరించారు. ఎకరాకు రూ.6 నుంచి రూ.7 వేల అధిక ఆదాయం పొందవచ్చని చెప్పారు. ఒకే రోజులో నాలుగెకరాల వరకు విత్తనాలు వేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, వీఏఏ జి.జగదీష్, రైతులు పాల్గొన్నారు.



డ్రమ్ సీడర్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీకృష్ణదేవ రాయలు, ఏఓ దేవదాసు

చిరుమామిళ్లలో వైభవంగా పునఃప్రతిష్ట

నాదెండ్ల: చిరుమామిళ్ళ నడింబజారులో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన శ్రీ రామమందిరంలో గురువారం విగ్రహ పునః ప్రతిష్టా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయం నిర్మించి రెండు శతాబ్దాలు పూర్తవటంతో ఆలయం శిథిలావస్థకు చేరింది. దీనిస్థానంలో జీర్ణోద్ధరణ పనుల్లో భాగంగా నూతన ఆలయం నిర్మించారు. శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి విగ్రహాలు, ఆలయ శిఖరాలను ఉదయం 8.35 గంటల శుభ ముహూర్తాన ప్రతిష్ట నిర్వహించారు. పశ్చిమ గోదావరి జిల్లా వేడంగి గ్రామానికి చెందిన వేదపండితులు కేతవరపు వెంకటేశ్వర శర్మ, స్థానిక పూజారి కొడవటిగంటి శంకరశర్మ బృందం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం శాంతిహోమాలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామంతో పాటూ చుట్టుప్రక్కల గ్రామాల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది.



చిరుమామిళ్ళ శ్రీరామ మందిరంలో ప్రత్యేక అలంకరణలో స్వామివార్లు



చిరుమామిళ్ళ శ్రీరామ మందిరంలో దాతలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

అనంతరం అన్నదానం నిర్వహించారు. గోల్కొండ గ్రూపు సంస్థల చైర్మన్ నడికట్టు రామిరెడ్డి, గ్రామ సర్పంచ్ సింగారెడ్డి లక్ష్మీ, మాజీ సర్పంచ్ మొండెద్దు జగన్నాథరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, మేకల రామిరెడ్డి, ఆంజనేయ రెడ్డి, కొమ్మసాని కమలాకరరెడ్డి, శ్యామల వెంకటరెడ్డి, యన్నం శివారెడ్డి, దొడ్డెంపూడి వేమారెడ్డి, మస్తాన్‌రెడ్డి, కస్టమ్స్ ఆఫీసర్ గాదె శ్రీనివాస రెడ్డి, రవీంద్రారెడ్డి, మేకల శ్రీనివాసరెడ్డి, మాజీ ఎంపీపీ కంజుల వీరారెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. దాతలను కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. అనంతరం గ్రామంలో భారీ అన్నదానం నిర్వహించారు.

అంగన్‌వాడీ సేవలపై అవగాహన

పెదకూరపాడు: పెదకూరపాడులో అంగన్‌వాడీ–2 సెంటర్‌లో 100 రోజులు ప్రణాళికలో భాగంగా అంగన్‌వాడీల్లో అందిస్తున్న సేవలు, బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణ నివారణపై తల్లులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త గోగులపాటి కుమారి అధ్యక్షత వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ మున్ని, విశ్రాంత సూపర్ వైజర్ షేక్ చావా నిర్మల మేరి పాల్గొని, మాట్లాడారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతు ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కావూరు గ్రామానికి చెందిన గుడిమెట్ల అంకమ్మ(62) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. గురువారం ఉదయం ఇంటి నుంచి పొలానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. ఎంతకూ ఇంటికి రాకపోవడంతో వెతుకులాట ప్రారంభించారు. గ్రామానికి చెందిన వారు అంకమ్మ పొలం వద్ద చెట్టుకు తాడుతో ఉరి వేసుకున్నాడని చెప్పడంతో వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య మరియమ్మ, ఐదుగురు సంతానం ఉండగా నాల్గో కుమారుడు ఏసుదాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

అమరావతి: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వ ఆదేశాల మేరకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంటి వైద్యాధికారి సుబ్బారావు తెలిపారు. అత్తలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు 574 మందికి కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. వారిలో 21 మందికి దృష్టి సమస్యలను గుర్తించి, కళ్లజోళ్లకు సిఫార్సు చేశామని తెలిపారు.